క్లుప్తంగా

అహల్యాబాయి జయంతి సందర్భంగా నేడు శోభాయాత్ర


మాధవరం కాంతారావు, అసెంబ్లీ ఇన్‌చార్జి

కూకట్‌పల్లి: అహల్యా బాయి 300 జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం శోభాయాత్ర నిర్వహించనున్నట్లు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10 గంటలకు బాలానగర్‌లోని నర్సాపూర్‌ చౌరస్తా బాబు జగ్జీవన్‌రాం విగ్రహం నుంచి రాజు కాలనీలోని అంబేడ్కర్‌ విగ్రహం వరకు శోభాయాత్ర కొనసాగుతుందని తెలిపారు. ర్యాలీకి ఎంపీ ఈటల రాజేందర్‌, బీజేపీ రాష్ట్ర నాయకులు ఎన్‌.వి.ఎస్‌ఎస్‌. ప్రభాకర్‌, మాధవి, జయశ్రీ, మేడ్చల్‌ అర్బన్‌ జిల్లా కన్వీనర్‌ డాక్టర్‌ మల్లారెడ్డి పాల్గొంటారని తెలిపారు.

ఘనంగా అహల్యా బాయి హోల్కర్‌ జయంతి


పూలమాలేసి నివాళి అర్పిస్తున్న నాయకులు


ఓల్డ్‌ బోయిన్‌పల్లి: గ్రామీణ అమ్మాయి నుంచి మాల్వా రాణిగా ఎదిగి సామాజిక సంక్షేమం పట్ల అంకిత భావంతో పని చేసిన గొప్ప నాయకురాలు మహారాణి అహల్యాబాయి హోల్కర్‌ అని బీజేపీ నాయకుడు తిరుపతి అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆమె 300 వ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మక్కాల నర్సింగ్‌, సమ్మయ్య, అశోక్‌ యాదవ్‌, సాంబశివరావు, శేఖర్‌, రమేష్‌, మణి తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి


సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ శ్రీనివాసరావు, అధికారులు

ఆల్విన్‌కాలనీ: సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్‌ నార్నే శ్రీనివాసరావు అన్నారు. హైదర్‌నగర్‌ డివిజన్‌ పరిధిలోని వెస్ట్రన్‌హిల్స్‌ సొసైటీ అడ్డగుట్ట కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్‌ అధికారులు, కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అడ్డగుట్ట కాలనీ ఐసీఐసీఐ బ్యాంక్‌ వద్ద నిత్యం నీళ్లు నిలుస్తుండటంతో రోడ్డు గుంతలమయంగా మారిందన్నారు. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు అత్యవసరంగా సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ వర్క్స్‌ ఇన్‌స్పెక్టర్‌ మహేదేవ్‌, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

కనువిందు..



మాదాపూర్‌: శిల్పారామంలో నిర్వహించే వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం ఓంకార పెర్‌ఫార్మింగ్‌ ఆర్ట్స్‌ సెంటర్‌ చెన్నై గురువు నాట్యరత్నం ప్రతీష్‌ శివానందం, గురువు షిబా ప్రతీష్‌ శిష్యబృందం భరతనాట్య ప్రదర్శనతో సందర్శకులను అలరించారు. ఇందులో పుష్పాంజలి, పదం, కాలభైరవం, కీర్తనం, తాండవం, హరిస్తోత్రం, శంభో మహదేవ, రామాష్టకం, నర్సింహకౌతం, రాగమాలిక జతిస్వరం, అయ్యప్పన్‌ తదితర అంశాలను కళాకారులు మోనిషా, సాధనశ్రీ, జోషిక, జీవన, కార్తీక, పూర్విత, నేత్ర, శుభశ్రీ, మేఘశ్రీ తదితరులు పాల్గొని ప్రదర్శించారు.

అన్నమయ్యపురంలో..

అన్నమయ్యపురంలో అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం శ్రీకృతి కూచిపూడి డ్యాన్స్‌ అకాడమీ గురువు లిలతారమేశ్‌ శిష్య బృందం కూచిపూడి నృత్యాంశాలను ప్రదర్శించారు. వినరో భాగ్యము, శుద్ధ బ్రహ్మ, జగడపు చనువుల, పరమ పురుషుడు, రంగని కళ్యాణం, శ్రీమన్నారాయణ, అలరులు కురియగా, దేవదేవంభజే కీర్తనలకు తమ నృత్యప్రదర్శనలతో సందర్శకులను ఆకట్టుకున్నారు. కళాకారులు శ్రీకృతి, రుత్విక, జగ్వి, నిహారికరెడ్డి, వైష్ణవి, జాహ్నవి, నాగజయ, శ్రీసన్నిద్‌, ఔసలిశాన్వి, హన్విత, సమన్వి, గీతాన్విత, మెరుగుచరిష్మ, తన్మయి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కళాకారులను అన్నమాచార్య భావనావాహిని నిర్వాహకులు అర్చన కోదాటి, రాజరాజేశ్వరి జ్ఞాపికలను అందజేశారు.

తొలగించాల్సిన వారే.. చెత్తను తెచ్చి వేస్తున్నారు!

ఇళ్ల మధ్యే స్వీపింగ్‌ వేస్ట్‌ పాయింట్‌ ఏర్పాటు చేసిన పారిశుద్ధ్య కార్మికులు

భగత్‌సింగ్‌ నగర్‌లో చెత్త సమస్య వీడడం లేదు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయొద్దని చెప్పే పారిశుద్ధ్య కార్మికులే రోడ్ల వెంట ఊడ్చిన వ్యర్థాలు, చెత్తను తీసుకువచ్చి ఇళ్ల మధ్య డంప్‌ చేస్తున్నారు. ఫలితంగా చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో చుట్టపక్కల నివాసితులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెత్తను తొలగించాలని పలువురు కోరుతున్నారు.




చెత్త పారబోస్తున్న పారిశుద్ధ్య కార్మికురాలు

- రోజుల తరబడి పేరుకుపోతున్న చెత్త
- అడిగిన వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కార్మికులు
- పట్టించుకోని అధికారులు

కేపీహెచ్‌బీకాలనీ: డివిజన్‌ పరిధిలోని భగంత్‌సింగ్‌ నగర్‌లో చెత్త వేయొద్దని మున్సిపల్‌ అధికారులు బోర్డు ఏర్పాటు చేసిన చోటే పారిశుద్ధ్య కార్మికులు వ్యర్థాలు తీసుకువచ్చి డంప్‌ చేస్తున్నారు. రోజుల తరబడి చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. నివాసితులు పారిశుద్ధ్య కార్మికులకు చెప్పినా వారిపైనే 'మీకు ఒక్కరికే ఇబ్బంది అయితుందా..?' అంటూ ఆగ్రహంతో సమాధానమిస్తున్నారు. ఓ పక్క పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్నామని చెబుతున్నా అవి కార్యరూపం దాల్చడం లేదు. చెత్త సేకరణదారులు సైతం వారానికి రెండు, మూడు పర్యాయాలకు మించి రావడం లేదని వాపోతున్నారు. అందరూ విధులకు వెళ్లాక మధ్యాహ్నం 11 గంటల సమయంలో చెత్త సేకరణ దారులు రావడంతో కొందరు రాత్రిళ్లు చెత్త తీసుకువచ్చి అక్కడే వేస్తున్నారు. దీంతో దుర్వాసనతో పాటుగా దోమలు విజృంభిస్తున్నాయి. సైడ్‌ కాల్వల్లోనూ మట్టి పేరుకుపోయి నీరు రోడ్డుపై పారుతుంది. దీంతో వాహనదారులు వెళ్లే సమయంలో బురద పడుతోందని పాదచారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

వసూళ్లు చేయడమే కాంగ్రెస్‌ పని

అవతరణ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

- రానున్నది బీఆర్‌ఎస్‌ ప్రభుత్వమే
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు


సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: ప్రజలను హింసించి డబ్బులు వసూలు చేసుకోవడమే కాంగ్రెస్‌ పార్టీ పని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బీఆర్‌ఎస్‌ శేరిలింగంపల్లి నియోజకవర్గ పార్టీ నాయకులతో క్యాంప్‌ కార్యాలయంలో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర అవతరణ వేడుకలను ఘనంగా నిర్వహించాలన్నారు. రాష్ట్ర సాధన కోసం ప్రాణాలకు తెగించి కేసీఆర్‌ రాష్ట్రాన్ని సాధించారన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్‌ పాలనలో జరిగిన అభివృద్ధిని ప్రతి ఒక్కరికి వివరించాలన్నారు. ఇప్పటికే కాంగ్రెస్‌ పాలనతో ప్రజలు విసుగెత్తిపోయారని, సంక్షేమం, అభివృద్ధిని పక్కన పెట్టారని ఎద్దేవా చేశారు. ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని, ప్రజలు మళ్లీ కేసీఆర్‌ని కోరుకుంటున్నారని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

కైత్లాపూర్‌లో కల్వర్టును పరిశీలన

కూకట్‌పల్లి: బాలాజీనగర్‌ డివిజన్‌ పరిధిలోని కైత్లాపూర్‌, శ్రీరామ్‌నగర్‌ కాలనీలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పర్యటించారు. శ్రీరామ్‌నగర్‌లోని కల్వర్టును పరిశీలించారు. అనంతరం స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్‌ పగుడాల బాబురావు, డీఈ శంకర్‌, బాలాజీనగర్‌ డివిజన్‌ అధ్యక్షులు ప్రభాకర్‌గౌడ్‌, కైత్లాపూర్‌ నాయకులు సంతోష్‌కుమార్‌, యాదయ్య గౌడ్‌, నవీన్‌, రాజేష్‌ రాయ్‌, సాయి శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా అభివృద్ధికి కృషి చేయాలి

మోతీనగర్‌: ఎన్నికల సమయంలోనే రాజకీయాలని, మిగతా సమయంలో అభివృద్ధి కోసం అందరూ కలిసి సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఇటీవల మోతీ నగర్‌ కో ఆపరేటివ్‌ హౌసింగ్‌ సొసైటీ లిమిటెడ్‌ ఎన్నికల్లో గెలుపొందిన బృందం సభ్యులు శనివారం ఎమ్మెల్యేని కలిశారు. అధ్యక్షుడు ఎస్‌వీ ప్రసాద్‌ను ఎమ్మెల్యే పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏ సమయంలో అయినా సమస్యల పరిష్కారం కోసం తన వద్దకు రావచ్చని సూచించారు. అభివృద్ధి పరంగా తాను ఎప్పుడూ ముందుంటానని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు పి. సుధారాణి, ప్రధాన కార్యదర్శి బి. సీతారామయ్య, కోశాధికారి పీఎస్‌. మూర్తి, సభ్యులు ఆర్‌. శ్రీనివాసన్‌, కంచర్ల శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్‌ శ్రావణ్‌కుమార్‌, నాయకులు అంబటి శ్రీనివాస్‌, తన్నీరు తిరుపతిరావు, హేమంత్‌ కుమార్‌, దత్తు, రవీంద్రనాథ్‌ ఠాగూర్‌, సీఎస్‌ఆర్‌ మూర్తి, సుధీర్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


విజయం సాధించిన వారిని అభినందిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి

పీఏసీ చైర్మన్‌, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ


ర్యాలీని ప్రారంభిస్తున్న పీఏసీ చైర్మన్‌ గాంధీ

ఆల్విన్‌కాలనీ: యువత పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని పీఏసీ చైర్మన్‌, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అన్నారు. బ్రహ్మకుమారీస్‌ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని శనివారం డీసీ గంగాధర్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యమే మహాభాగ్యం అని అన్నారు. ధూమపానం ప్రభావం ఊపరితిత్తులపై నేరుగా పడుతుందని తెలిపారు. అదే విధంగా గుండె సంబంధిత వ్యాధులు, సంతానలేమి సమస్యలు, వివిధ కేన్సర్లు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. పొగాకు వాడకం తగ్గించడం కోసం ప్రజల్లో, యువకుల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మంత్రిప్రగడ సత్యనారాయణరావు, బ్రహ్మకుమారీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ తల్లి కల్యాణ వేడుకలు ప్రారంభం

మోతీనగర్‌: మూసాపేట డివిజన్‌ కబీర్‌నగర్‌లోని పోచమ్మ తల్లి కల్యాణ మహోత్సవ వేడుకలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రారంభం సందర్భంగా ప్రభాత సేవ, అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, గంగ తెప్పకు బయలుదేరుటతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి అలంకరణ, అమ్మవారి కల్యాణం, అనంతరం అన్నదానం కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ముగింపు సందర్భంగా సోమవారం బోనాలు, తొట్టెల ఊరేగింపుతో మూడు రోజుల పాటు కొనసాగి ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

కేన్సర్‌పై అవగాహన

ఆల్విన్‌కాలనీ: నో టుబాకో డే సందర్భంగా ఏఎస్‌రాజు నగర్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌, బసవతారకం ఇండో అమెరికన్‌ కేన్సర్‌ హాస్పిటల్స్‌ ఆధ్వర్యంలో ఉచిత కేన్సర్‌ స్క్రీనింగ్‌ పరీక్ష, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డా. శ్రావణి కుమారి, డా. ప్రభాకర్‌, డా. సాయి మనోజ్‌, ఆనయి బాబ, ఎర్రబెల్లి సతీష్‌రావు, నర్సింహ నాయుడు, పీఎస్‌ రాజు, నర్సింహారెడ్డి, ఏకాంబరం పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలి

- కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌

ఆల్విన్‌కాలనీ: యుద్ధ ప్రాతిపదికన సీసీ రోడ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్‌ పరిధిలోని ఇంద్ర హిల్స్‌ కాలనీలో రూ.28 లక్షల నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఏఈ శ్రావణితో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డును మంచి లెవెలింగ్‌ చేసి వర్షపు నీరు నిలిచిపోకుండా, ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టాలన్నారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సమ్మారెడ్డి, కాలనీ అధ్యక్షులు వెంకట్‌నాయక్‌, జి. రామారావు, మోహన్‌రావు, రంజిత్‌, మోహన్‌, ఎన్‌. బాలస్వామి, పి. వెంకటయ్య, శ్యామ్‌, యాదయ్య, లక్ష్మి, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ రవికుమార్‌, కాలనీ వాసులు పాల్గొన్నారు.


సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ వెంకటేష్‌గౌడ్‌, ఏఈ శ్రావణి

బస్సులను పునరుద్ధరించాలని మంత్రికి వినతి


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మోతీనగర్‌: బోరబండ నుంచి పూర్వ వరంగల్‌ జిల్లా తొర్రూర్‌కు నడిచే బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించాలని శనివారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మూసాపేట కాంగ్రెస్‌ పార్టీ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌ పార్టీ సీనియర్‌ నాయకుడు గోపిశెట్టి రాఘవేందర్‌ మాట్లాడుతూ.. కొన్ని సంవత్సరాలుగా బోరబండ నుంచి తొర్రూర్‌ వరకు ఉదయం 4.35 గంటలకు బస్సు సౌకర్యం ఉండేదన్నారు. కొన్ని నెలల నుంచి నిలిపివేయడంతో ఆ ప్రాంత వాసులు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అదే విధంగా బోరబండ నుంచి కలెక్టర్‌ కార్యాలయానికి వెళ్లే కీసరకు కూడా బస్సులను కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బొమ్మగాని సత్యనారాయణ గౌడ్‌, సుధాకర్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి


దోమల నివారణ అవగాహనలో కార్పొరేటర్‌ సతీష్‌ గౌడ్‌, అధికారులు

బాలానగర్‌: దోమల నివారణకు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని కార్పొరేటర్‌ పండాల సతీష్‌గౌడ్‌ అన్నారు. వర్షాకాలం సమీపిస్తున్నందున జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ డిపార్టుమెంట్‌ ఆధ్వర్యంలో శనివారం దోమల నివారణపై అవగాహన, ర్యాలీ నిర్వహించారు. ఫతేనగర్‌ డివిజన్‌లోని పలు బస్తీ, కాలనీల్లో వర్షపు నీరు ఎక్కడెక్కడ చేరుతుందో అక్కడ దోమల నివారణకు రసాయనాల పిచికారీ చేశారు. స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిల్వ ఉన్న నీటిలో లార్వా పెరిగి దోమల వ్యాప్తి జరిగి విష జ్వరాలు, డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందన్నారు. మన ఇంటి పరిసరాల్లో గుంతలు, పాత కూలర్స్‌, పూలకుండీలు, డ్రమ్ములు, టైర్లు, పగిలిన ప్లాస్టిక్‌ బక్కెట్లు, మట్టికుండలు, బిల్డింగ్‌ పైన ఉండే సింటెక్సు, సిమెంటు గోళాలు వంటి వాటిలో నిల్వ ఉన్న నీటిని వారానికి ఒక్కసారైనా తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఎంటమాలజీ ఏఈ సోని, ఎస్‌ఎఫ్‌ఐ యాదిలాల్‌, సిబ్బంది పాల్గొన్నారు.

నవజాత శిశువు, బాలింత మృతి



బాలానగర్‌: నవజాత శిశువు, బాలింత మృతి చెందిన ఘటన బాలానగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో శనివారం జరిగింది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. సంగారెడ్డి పట్టణానికి చెందిన అరుణ కేపీహెచ్‌బీ కాలనీలోని 4వ ఫేజ్‌లో నివాసం ఉండే ఆమె అమ్మ వద్దకు వచ్చింది. బాలింత కావటంతో ఆమె కుటుంబ సభ్యులు బాలానగర్‌ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అరుణను తీసుకొచ్చారు. మగ బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం కళ్లు తిరిగి బెడ్‌ మీద పడిపోవటంతో వెంటనే వైద్య సిబ్బంది 108 ద్వారా గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. పుట్టిన బిడ్డను నీలోఫర్‌ ఆసుపత్రికి తరలించగా.. బాబు కూడా మృతి చెందాడు. తల్లి, బిడ్డ మృతి చెందటంతో విషాదం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నత్తనడకన నల్ల చెరువు పనులు!

పట్టాదారులకు నోటీసులు ఇవ్వకుండానే నిర్మాణాలను కూల్చి వేసిన హైడ్రా!

- నీటి తొలగింపు వద్దే పనులు
- చిన్నపాటి వర్షానికి గుంతల్లో నీళ్లు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని నల్ల చెరువు అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. హైదరాబాద్‌ డిజాస్టర్‌ రెస్పాన్స్‌ అండ్‌ అసెట్స్‌ ప్రొటెక్షన్‌ ఏజెన్సీ (హైడ్రా) చేస్తున్న పనులు మూడు అడుగులు ముందుకు, ఏడు అడుగులు వెనక్కు అన్న చందంగా సాగుతున్నాయి. చెరువులను పరిరక్షించేందుకు హైడ్రా ముందుగా చెరువులో ఉన్న స్థలాలను తమ ఆధీనంలోకి తీసుకోవడానికి ఎన్నో సవాళ్లను ఎదుర్కొంది. ఎఫ్‌టీఎల్‌ భూములను ఆక్రమించారంటూ చెరువులో ఉన్న కొన్ని నిర్మాణాలను తొలగించే సమయంలో స్థానికుల నుంచి, పట్టాదారు, రైతుల నుంచి వ్యతిరేకత వచ్చింది. చెరువు స్థలం 27 ఎకరాల వరకు ఉందని హైడ్రా ముందుగా నిర్ణయించింది. దీంతో పట్టాదారులు చెరువు స్థలం అంత లేదని పట్టా పాస్‌బుక్‌ల ద్వారా కోర్టును ఆశ్రయించారు. కోర్టు హైడ్రాను పనులను నిలిపివేయాల్సిందిగా ఆర్డర్‌ జారీ చేసింది. అనంతరం రైతులతో సమావేశం ఏర్పాటు చేసిన హైడ్రా అధికారులు.. ఎమ్మెల్యే సమక్షంలో రైతులకు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీంతో సమ్మతించిన రైతులు హైడ్రా అధికారులను నమ్మారు. రైతులకు ఎలాంటి న్యాయం చేయకముందే హైడ్రా అధికారులు ఆగమేఘాల మీద చెరువు సమీపంలో ఉన్న నిర్మాణాలను నోటీసులు ఇవ్వకుండానే కూల్చి వేశారు. రైతులు హైకోర్టును ఆశ్రయించినప్పటికీ అధికారులు పనులను కొనసాగించారు.



నీటి తొలగింపు వద్దే పనులు

హైడ్రా అధికారులు వేసవి కాలం మొత్తం చెరువు చుట్టూ ఉన్న ఆక్రమణలు తొలగించి హద్దులు ఏర్పాటు చేసే విధంగా ప్రయత్నించారు. చివరగా 19 ఎకరాలను చెరువు ప్రాంతంగా తేల్చి అంత వరకే అభివృద్ధి పనులు చేపడతామని, మిగిలిన భూములకు తమకు సంబంధం లేదని హైడ్రా కమిషనర్‌ తేల్చి చెప్పారు. అయితే అప్పటి నుంచి గత వారం రోజులుగా హైడ్రా హద్దులు ఏర్పాటు చేసిన ప్రాంతంలోనే గోతులు తీశారు. నల్ల చెరువు అభివృద్ధి సమయంలోనే వర్షాలు ప్రారంభమయ్యాయి. చిన్నపాటి వర్షాలకే చెరువులోని గోతులన్నీ నిండిపోవడంతో చెరువులోకి వాహనాలు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. ఇదిలా ఉండగా ప్రస్తుతం చెరువులో గోతుల్లో ఉన్న నీటిని మోటార్ల ద్వారా బయటకు పంపించటంతో భూగర్భ జలాలు మోటార్లకు అందటం లేదని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. నల్ల చెరువు అభివృద్ధి కోసం అందరూ కాంక్షించినప్పటికీ అందరి అభిప్రాయాలను పరిగణలోనికి తీసుకోకుండా హైడ్రా అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హైడ్రా అధికారులు ఇప్పటికైనా చెరువులో నీరు నిల్వ ఉండే విధంగా చేసి, అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.


కూకట్‌పల్లిలోని నల్లచెరువులో జేసీబీ తవ్వకాలు